క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణకు నిరంతరం కృషి చేస్తాం

అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు



రేపల్లె రూరల్: అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఆ శాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని రూపా అపార్ట్‌మెంట్ హాలులో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు వాటిల్లిన సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయక అగ్నిమాపక సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేస్తారన్నారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలకు జాప్యం చేయకుండా వెళ్లి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా కృషి చేస్తారన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించే విధానాలు, ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగ పూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అమర్తలూరు(వేమూరు): పేదలకు అన్నదానం చేయడం ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని విఘ్నేశ్వర ఆలయం వద్ద ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అమర్తలూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి ఆదిశేషా రత్నమ్మ జ్ఞాపకార్థం కుమారుడు ప్రభాకరరావు కుటుంబ సభ్యుల సహకారంతో నిత్య అన్నదానం కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభించారు. బుధవారం కూడా అన్నదానం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి రోజు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్నదానం కార్యక్రమం చేపట్టిన గొట్టిపాటి ప్రభాకరరావు కుటుంబాన్ని ఆయన అభినందిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారి దాటే క్రమంలో వ్యక్తి మృతి




చెరుకుపల్లి: జాతీయ రహదారి దాటే క్రమంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండల పరిధిలోని గుళ్ళపల్లి గ్రామానికి చెందిన భట్టు నాగేశ్వరరావు (36)అనే వ్యక్తి పొన్నపల్లి గ్రామ సమీపంలో 216 జాతీయ రహదారి దాటుతుండగా ప్రమాదవశాత్తు ఆటో తగలి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి



బాపట్లటౌన్: ఈ నెల 11న బాపట్ల రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఐఆర్‌సీటీసీ బుకింగ్ కౌంటర్ నిర్వాహకుడు తులాబందుల లక్ష్మీనారాయణతో పాటు తనపై కూడా పెట్రోలు పోసుకొని నల్లమోతు మాధవి నిప్పంటించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 11 నుంచి బుధవారం ఉదయం వరకు గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో ఇరువురు చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతూ నల్లమోతు మాధవి (54) బుధవారం ఉదయం మృతి చెందారు. లక్ష్మీనారాయణ చికిత్స పొందుతున్నారు. మాధవి మృతదేహాన్ని గురువారం బాపట్లకు తరలించనున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



చావలి(వేమూరు): అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం జరిగిందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో 6, 7 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు బుధవారం నిర్వహించారు. పిల్లల బరువు చూడటం జరిగిందని, పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ఆటోలకు ఎండ దెబ్బ

- కష్టాల్లో ఆటోవాలాలు
- గిరాకీ తగ్గడంతో ఆందోళనలో డ్రైవర్లు
- కిస్తీలు కట్టలేని దుస్థితి



సూర్యలంక వద్ద ఆటోస్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోడ్రైవర్లు



బాపట్ల ఆటోస్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

బాపట్ల: మూడు చక్రాల బండిని పొద్దస్తమానం తిప్పినా మూడు పూటలా తినలేని పరిస్థితి ఆటోవాలాల జీవితం. రోజురోజుకు పెరుగుతున్న ఎండలు ఆటో డ్రైవర్ల జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి. వెక్కిరిస్తున్న నిరుద్యోగాన్ని ఎదిరించేందుకు అప్పోసప్పో చేసి ఆటోను కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించాలని చేస్తున్న కష్టం కూడు పెట్టడం లేదు. అప్పు చేసి ఫైనాన్స్‌పై కొనుగోలు చేసిన ఆటోకు కనీసం డీజిల్‌కు సరిపడా డబ్బులు రాకపోవడంతో కిస్తీలు కట్టేది ఎలా అని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఎండలు మండుతుండటంతో మరిన్ని కష్టాలు మొదలయ్యాయి. గిరాకీ తగ్గడంతో జీవన పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఎప్పుడూ రద్దీగా ఉండే ఆటోవాలాల పరిస్థితి నేడు గిరాకీ లేక అగమ్య గోచరంగా మారింది.

కష్టంగా మారిన జీవనోపాధి

రోజురోజుకు పెరుగుతున్న ఎండల కారణంగా ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య తగ్గిపోతుంది. భానుడి ప్రతాపానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎప్పుడు రద్దీగా కనిపించే ఆటోలు బోసిపోయి సేద తీరుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు దాటేంత వరకు ప్రజలు ఎండలకు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో ఆటోవాలాలకు గిరాకీ లేక ఏం చేయాలో అర్థం కావడం లేదు. రోజూ వచ్చే సంపాదనతో ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆటో డ్రైవర్ల జీవనం దుర్భరంగా మారింది. ప్రస్తుతం భారీగా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు వాహన ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందడం ఏ ఏడాదికా ఏడాది భారంగా మారిపోతుందని ఆటోవాలాలు వాపోతున్నారు. చదువుకున్న యువతకు ఉపాధి లేక వేల మంది నిరుద్యోగులు ఆటో తోలుకుంటూ జీవనం గడుపుతున్నారు. ప్రస్తుతం రోజంతా ఆటో తోలినా పూటగడవని పరిస్థితి నెలకొంది.

పెరిగిపోతున్న ఆటోల సంఖ్య

బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలు ఉన్నాయి. వీటిల్లో బాపట్ల మండలంలో బాపట్ల-సూర్యలంక రూట్‌లో 130 ఆటోలు, బాపట్ల-పెదనందిపాడు పాయింట్‌లో 100 ఆటోలు, బాపట్ల-కర్లపాలెం రూట్‌లో 150, బాపట్ల-పిన్నిబోయినవారిపాలెం రూట్‌లో 75, బాపట్ల-చీరాల రూట్‌లో 220, బాపట్ల-పాండురంగాపురం రూట్‌లో 70, కర్లపాలెం నుంచి తుమ్మలపల్లి రూట్‌లో 30, కర్లపాలెం-చందోలు రూట్‌లో 150 ఆటోల చొప్పున ఉన్నాయి. వీటిపై ఆధారపడి నియోజకవర్గంలో సుమారు 4 వేల కుటుంబాలు జీవిస్తున్నాయి.

- గ్రామాల్లో నిరుద్యోగులు పెరిగి పోతుండటంతో యువకులు ఆటోలను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆటోలను నడుపుతున్నారు.
- ఆటోల సంఖ్య ఎక్కువ కావడంతో గిరాకీ తక్కువ అవుతుంది. సాధారణ రోజుల్లో రూ.600 నుంచి రూ.800 సంపాదిస్తుండగా వేసవి ఎండల కారణంగా రూ.300 నుంచి రూ.500 కూడా రావడం లేదని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రయాణికుల పైనే ఆధారపడి జీవించే ఆటోవాలాలకు కష్టాలు తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కనీసం ఏడాదికి రూ.10 వేలు ఇవ్వటంతో ఆటోలు బ్రేక్ చేయించుకునేందుకు ఉపయోగపడేవని చెబుతున్నారు.

గిరాకీ తగ్గింది



ఎండలు బాగా మండిపోవడంతో రోజురోజుకు గిరాకీ తగ్గిపోతుంది. మరో రెండు నెలల పాటు ఎండలు ఇలాగే ఉంటే కిస్తీలు కట్టేది ఎట్లా.. మేము బతికేది ఎట్లా, ఆటో డ్రైవర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేయాలి.

– కొక్కిలిగడ్డ శ్రీను, ఆటోడ్రైవర్, ముత్తాయపాలెం

భారంగా కుటుంబ పోషణ



ఈ సారి ఎండలకు గిరాకీ భాగా తగ్గింది. రోజూ వచ్చే ఆదాయం రాక ఇబ్బందులు పడుతున్నాం. ఆటో కిస్తీలు ఎలా కట్టాలో, ఎలా బతకాలో అర్థం కావడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారుతుంది. ప్రతి రోజు గిరాకీ లేక ఖాళీగా ఉంటున్నాం.

– కన్నా శివబాలకోటేశ్వరరావు, ఆటోడ్రైవర్, ఆదర్శనగర్

వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఖాళీ స్థలంలోని వ్యర్థాలను వెంటనే తొలగించి.. అక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని డాంగేవారి వీధి, చెంచుపేట, అమరావతి ప్లాట్స్ లలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32వ వార్డులో ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ స్థలంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వారికి ఆహ్లాదాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ సునీల్, వైఎస్సార్ సీపీ నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు ఉన్నారు.

నందివెలుగులో వ్యక్తి అదృశ్యం

తెనాలిరూరల్: వ్యక్తి అదృశ్యంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం నందివెలుగు జాషువానగర్ కు చెందిన కొత్తపల్లి రమేష్ కొంతకాలంగా మానిక రుగ్మతతో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతున్నాడు. తన అన్న దీనదయాళ్ వద్ద నందివెలుగులో ఉంటున్నాడు. ఈనెల 9న దీనదయాళ్ నిద్రిస్తున్న సమయంలో రమేష్ ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో అతను పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, రమేష్ ఇంటి నుంచి బయటకు వెళుతున్న సమయంలో తెలుపు చొక్కా, నలుపు ప్యాంటు ధరించి ఉన్నాడని, గుర్తించిన వారు రూరల్ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్ఐ ఆనంద్ కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తెనాలిరూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తెనాలి అగ్నిమాపక, విపత్తు స్పందన శాఖ అధికారులు సిబ్బంది పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మూడో రోజుకు చేరుకున్న వారోత్సవాల్లో భాగంగా అపార్ట్‌మెంట్‌లలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు జరుగకుండా పాటించాల్సిన జాగ్రత్త చర్యల గురించి చెంచుపేట రిలయన్స్ పెట్రోల్‌బంకు సమీపంలోని సింధుప్రియ అపార్ట్‌మెంట్‌లోని వారికి అవగాహన కల్పించారు. అలాగే సిలిండర్ల నుంచి మంటలు చెలరేగితే మంటలను అదుపుచేసే విధానాన్ని ప్రదర్శించారు. ఇన్‌చార్జి అగ్నిమాపకాధికారి కె. కోటిరెడ్డి నేతృత్వంలో అగ్నిమాపక బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది.

29 మందికి జరిమానా

విజయవాడలీగల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 29 మందికి 8వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు జరిమానా విధించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో 5వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో 11మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి.. పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేయడం జరుగుతుందని, వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు.

దేశంలో పెరుగుతున్న అంతరానితనం, అసమానతలు



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

తాడేపల్లి రూరల్: దేశంలో అంటరానితనం, అసమానతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని విప్లవ రచయిత సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కన్వీనర్ కిరణ్ తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని యానాదుల కాలనీలో బుధవారం పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యానాదులు ఉద్యమాలు నడిపారని తెలిపారు. వారి తాకిడిని తట్టుకోలేని బ్రిటిష్ ప్రభుత్వం పోరాట యోధులైన ఊటుకూరు కోటయ్య, నిమ్మల శేషయ్య, ఎర్ర సుబ్బయ్య, కత్తి చెల్లెమ్మ, వేణుబాక రామయ్య తదితరులపై దాడి చేసి జైళ్లలో బంధించిందని చెప్పారు. పురాతత్వ పరిశోధనల ప్రకారం తెలుగు భాష ప్రాచీనత 2400 సంవత్సరాల నాటిదని తెలిపారు. ఈ భాషని, యానాదులే మాట్లాడేవారని, తీసుకువచ్చింది వారేనని పరిశోధనలు చెబుతున్నాయని వివరించారు. పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు షేక్ నాగూర్ వలి, శ్రీధర్‌లు మాట్లాడుతూ నేడు ముస్లింలు, క్రిస్టియన్లపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో సంఘటనలు దేశ ప్రజలంతా చూశారన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పగడాల ప్రవీణ్‌ని ఎవరు హత్య చేశారో ఇప్పటి వరకు వెలుగులోకి రాలేదని తెలిపారు. పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి గోపీనాథ్ మాట్లాడుతూ ఇటీవల మంగళగిరిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఛత్రపతి శివాజీ పుట్టిన రోజు సందర్భంగా ఊరేగింపుగా ర్యాలీ చేశారని గుర్తు చేశారు. తమకు ఎవరైనా ఎదురు చేస్తే వారిపై భౌతిక దాడులు చేస్తామని ఉద్దేశపూర్వకంగా ర్యాలీ నడిచినట్టే ఉందని ఆయన పేర్కొన్నారు.

ఫిరంగిపురం సీఐగా శివరామకృష్ణ బాధ్యతల స్వీకరణ

ఫిరంగిపురం: స్థానిక పోలీసు స్టేషన్ సీఐగా కె.శివరామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీ డిపార్టుమెంటులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డు తూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి సారించి అరికడతానని చెప్పారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రవీంద్రబాబు వీఆర్‌కు వెళ్లారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

దుగ్గిరాల: మండలంలోని గొడవర్రులో బుధవారం ఆది రేణుకమ్మ తల్లి, పోతురాజు స్వామి నూతన విగ్రహాల ప్రతిష్ట కన్నుల పండువగా జరిగింది. ఉదయం 8.22 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎన్.గోపాలకృష్ణ, కె.రామారావు, పి.ప్రసాద్, ధనరాజు, శ్రీనివాసరావు, పోతురాజు, శ్రీహరి, హర్షవర్ధన్, మల్లికార్జున, ఆదిశేషు పాల్గొన్నారు.

పర్యావరణ హిత ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి అవసరం

అన్నా యూనివర్సిటీ డీన్ ఆర్. జయవేల్



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఐసీఈఈఎస్–2025 పేరుతో 'ఎమర్జింగ్ ఎలక్ట్రానిక్ సస్టైన్‌బిలిటీ' అంతర్జాతీయ సదస్సును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడులోని చెన్నైకు చెందిన అన్నా యూనివర్సిటీ డీన్ ఆర్. జయవేల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో మెటీరియల్స్ వినియోగం ద్వారా పర్యావరణ హితం కలిగించే ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి సారించాలని తెలిపారు.

రిజిస్ట్రార్ కె. సుబ్బారావు మాట్లాడుతూ సదస్సుకు అడ్వాన్స్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందించినట్లు పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి 400కు పైగా పరిశోధన పత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా చెన్నైకు చెందిన ఎంఈటీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి.రాజేంద్రన్ పర్యావరణ మార్పులకు అనుగుణంగా తట్టుకునే ఎలక్ట్రానిక్ వ్యవస్థల అవసరాన్ని వివరించారు. సదస్సులో వడోదరాకు చెందిన జీఎస్ఎఫ్‌సీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జీ.ఆర్. సిన్హా, ఐఆర్‌డీ విభాగాధిపతి వి. విశ్వనాథ్ షెనాయ్, కేఎల్‌యూ వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు ఏవీఎస్ ప్రసాద్, కె. రాజశేఖరరావు, ఎన్. వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి కేఆర్ఎస్ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి ఎం. సుమన్, ఐఆర్‌డీ అసోసియేట్ ప్రొఫెసర్ వి. వివేకానందన్, ఈఎల్‌జీఈ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్. అరుణ్ మేథా, ఎన్ఐటీ, ఐఐటీలతో పాటు జాతీయ విద్యాసంస్థలు, ఇతర దేశాల నుంచి పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త రాధకు అవార్డు



రాధను అభినందిస్తున్న వైద్యులు ఫరీనాబేగం, యానీగ్రేస్, సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడుకు చెందిన పొనుగుపాటి రాధకు ఉత్తమ ఆశా కార్యకర్త అవార్డు వచ్చినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు ఫరీనా బేగం బుధవారం తెలిపారు. వైద్యశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయిలో ఉత్తమ కిల్కారీ సేవలు మెరుగ్గా అందించినందుకు అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్త రాధను వైద్యులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ యానీ గ్రేస్, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, కె.సుదర్శన్ రాజు పాల్గొన్నారు.

బాలుని కుటుంబానికి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న అంటరానితన నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు డాక్టర్ చార్వాక

కర్లపాలెం: ఇసుక క్వారీ గుంతలో పడి మృతి చెందిన బాలుడు ఉన్నం ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని అంటరానితన నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక డిమాండ్ చేశారు. యాజలి గ్రామంలో మార్చి 19వ తేదీన ఇసుక క్వారీ గుంతలో పడి మృతి చెందిన బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆ బాలుని తల్లిదండ్రులు ఉన్నం కిషోర్, అమృతమ్మలతో కలసి బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో చార్వాక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక క్వారీ తవ్వి ఇసుక విక్రయించుకుని నిర్లక్ష్యంగా గుంతను వదిలేసిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ఇసుక క్వారీ గుంతను తవ్వినా ఎలాంటి చర్యలు తీసుకోని మైనింగ్ అధికారులపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాలు నివారణ

అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు



అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

బాపట్లటౌన్: అవగాహనతోనే అగ్ని ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించగలమని అగ్నిమాపక అధికారి వై.వెంకటేశ్వరరావు తెలిపారు. అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని భావన అపార్ట్‌మెంట్, విజయలక్ష్మిపురం ప్రాంతాల్లోని మహిళలకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బహుళ అంతస్తుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు వంటచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ లీకైనట్లు ఏ విధంగా గుర్తించాలి.. రబ్బర్‌ట్యూబ్‌ను ఏ విధంగా మార్చుకోవాలి.. అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు పై నుంచి కిందికి ఏ విధంగా రావాలి.. గ్యాస్ బండ లీకై మంటలు వ్యాపిస్తే వాటిని ఏ విధంగా అదుపుచేయాలనే అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేత



వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పబ్లిక్ గ్రీవెన్స్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల కోసం ప్రభుత్వం ప్రతి నెల పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా మండలంలో వివిధ వ్యవసాయ యంత్ర పరికరాల కోసం 49 మంది రైతులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న పరికరాలు సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మారుతి శేషాంబ, గొట్టిపాటి పూర్ణ కుమారి, యలవర్తి బ్రహ్మానందం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీడితవర్గాల ప్రతిఘటనకు రూపం 'ముట్టడి'

పుస్తకావిష్కరణ సభలో వక్తలు



ముట్టడి నాటకం పుస్తకాన్ని ఆవిష్కరించిన మోపిదేవి ఫణిరాందేవ్

తెనాలి: బలవంతుల ఉక్కుపాదం కింద నలుగుతూ చావుకీ బతుక్కీ ఊగిసలాడుతున్న పేదజనం ఉప్పెనలా తిరగబడితే పర్యవసానం ఎలా ఉంటుందనేది 'ముట్టడి' నాటకం అద్భుతంగా చిత్రీకరించిందని ఆ నాటక పుస్తకావిష్కరణలో వివిధ రంగాల ప్రముఖులు ప్రశంసించారు. పట్టణ చినరావూరుకు చెందిన పెరికల ప్రకాష్ 1986లో రచించిన ముట్టడి నాటకం గత మూడున్నర దశాబ్దాలుగా స్క్రిప్ట్ రూపంలోనే రాష్ట్రం మొత్తం వందకు పైగా ప్రదర్శనలకు నోచుకుంది. రచయిత ఇంటిపేరుగా 'ముట్టడి' చేరింది. ఇంత కాలానికి ఆ నాటకాన్ని పుస్తకరూపంలో తీసుకొచ్చారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో బుధవారం రాత్రి ఏర్పాటైన సభకు న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నేత మోపిదేవి ఫణిరాందేవ్ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమాజ రుగ్మతలను ప్రతిబింబించే కళారూపానికి ప్రజాదరణ ఉంటుందన్న వాస్తవానికి ప్రతిరూపం ముట్టడి నాటకమని చెప్పారు. మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ, సామాజిక రుగ్మతలపై గురిపెట్టిన తుపాకీ 'ముట్టడి'గా చెబుతూ, ఇలాంటి నాటకం రావటం రంగస్థల ప్రయోగమేనని అన్నారు. 'ఇస్కఫ్' జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ కనపర్తి అబ్రహాం లింకన్, కనపర్తి బాబూరావు, చిట్టూరి సీతారామయ్య, ఎహేస్కేలు మాట్లాడారు. రచయిత ముట్టడి ప్రకాష్ నాటక రచన నేపథ్యం వివరించారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు

తాడేపల్లి రూరల్: డిగ్రీ చదివిన విద్యార్థిని, విద్యార్థులతో పాటు నిరుద్యోగులకు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణ, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాలోని వారికి ఈనెల 26వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కోర్సు కాలపరిమితి మూడు నెలలు అని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రతి శనివారం, ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వారికి మంగళగిరి రత్నాల చెరువు అండర్ పాస్ వద్ద గల మానవ సేవా సంస్థ కార్యాలయంలోను, కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి, ఎన్‌టీఆర్ జిల్లాల వారికి తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని కుంచనపల్లి వద్ద ఉన్న కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. మరిన్ని వివరాలకు 9393771663, 9985222857 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

న్యాయస్థానాల తీర్పులను అమలు చేయాలి



శిబిరంలో కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని బుధవారం నాయకులు కూరపాటి స్టీవెన్, టి. నాగేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు కార్మికులు తమ సమస్యను విన్నవించుకున్నారన్నారని తెలిపారు. స్పందించిన ఆయన తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను ఆయన నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ఎం. గురవయ్య, సాంబశివరావు, హగ్గయ్య, ఇమాంబి, శివకుమారి, దుర్గా భవాని, సారమ్మ, రమాదేవి పాల్గొన్నారు.